సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 14 । జూన్ । 2024



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 8లో



విశేషంగా నిత్యకల్యాణం

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. 8లో



విరగ్గాసిన ఈత

అరకులోయ రూరల్: ఈతపండు సీజన్ వచ్చేసింది. ప్రస్తుతం ఏజెన్సీలో విరగ్గాసిన కాసిన గెలలతో ఈతచెట్లు కళకళలాడుతున్నాయి.

రక్త బంధువులు

అన్నిదానాల్లోకి అన్నదానం గొప్పదన్న మాట అందరికీ తెలిసిందే. మారిన సామాజిక పరిస్థితుల్లో ఆ అన్నదానం కంటే మహోన్నతమైనది రక్తదానం. కాన్పు సమయంలో గర్భిణులకు.. ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం చాలా అవసరం. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందన్న సామాజిక బాధ్యతతో పలువురు ఇప్పటికే స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. పాడేరు పరిసర ప్రాంతాల్లో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చి రక్త సేకరణను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తోంది రెడ్ క్రాస్ సొసైటీ, కొంతమంది అధికారులు.

- రక్తదానంపై ఉద్యమంలా చైతన్యం
- సేకరణలో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ
- 49 శిబిరాల నిర్వహణ
- 1193 యూనిట్ల సేకరణ
- సామాజిక బాధ్యతగా ముందుకు వస్తున్న యువత, అధికారులు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



పాడేరు డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు (ఫైల్)



పాడేరులో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం (ఫైల్)

సాక్షి, పాడేరు: జిల్లాలో రక్తం అవసరం పెరిగింది. ఒకప్పుడు మైదాన ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు సేకరించిన రక్త నిల్వలను ఈ ప్రాంత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉపయోగించేవారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం జిల్లాలో పునర్విభజనలో భాగంగా 2022లో అల్లూరి సీతారామరాజు జిల్లా పేరిట ప్రత్యేక జిల్లా ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో అదే సంవత్సరం పాడేరు కేంద్రంగా రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటైంది. జిల్లావ్యాప్తంగా గిరిజనులకు అవగాహన కల్పిస్తూ రక్త సేకరణను ఉద్యమంలా చేపడుతూ శిబిరాలు నిర్వహిస్తోంది. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ సొసైటీ ఇప్పటివరకు 49 రక్తదాన శిబిరాలను నిర్వహించింది. సుమారు 1193 యూనిట్ల రక్తాన్ని సేకరించింది. పాడేరు, రంపచోడవరం, చింతూరు, కూనవరం, అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలోని రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందిస్తూ ప్రాణదాతగా నిలుస్తోంది.

మేము సైతం..

పాడేరు డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 139 యూనిట్లు రక్తాన్ని సేకరించి రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశారు.

ప్రాణదాత.. సీఐ సుధాకర్

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం మోదుల వలసకు చెందిన బొడ్డేపల్లి సుధాకర్ ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశారు. 2013లో పోలీసు శాఖలో ఉద్యోగికి చేరిన నాటి నుంచి రక్తదానం చేయడం ఆయనకు సామాజిక సేవగా మారింది. ఇటీవల వరకు పాడేరు సీఐగా పనిచేసిన ఆయన ప్రస్తుతం సైబర్ క్రైం విభాగం సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ప్రతీ శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రక్తదానంతో ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి. పాడేరులో పనిచేస్తున్న ఈ మూడేళ్లలో నాలుగు సార్లు రక్తదానం చేశా.తనతో పాటు మిగతా శాఖల అధికారులు,సిబ్బంది రక్తదానం చేస్తున్నారు.గిరిజన ప్రాంతాల్లో రక్తం అవసరాలు పెరిగినందున రక్తదాన శిబిరాలకు యువత అంతా ముందుకు రావాలి. రక్తం దానం చేయడం ఆరోగ్యానికి మంచిదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు



రక్తదానం చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ (ఫైల్)

26 సార్లు రక్తదానం చేశా



ఇప్పటివరకు 26 సార్లు రక్తదానం చేశా. 19 ఏళ్ల వయసు నుంచి రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్నా. ఈ ప్రాంతంలో రక్తం కొరత ఎక్కువగా ఉంది. ఈ సమస్య అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి. పాడేరులోని ఓ స్వచ్ఛంద సంస్థ రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించేది. ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్తం అందించి ఊపిరి పోసేది. ఆ సంస్థ స్ఫూర్తితో ఏటా రెండు సార్లు రక్తం దానం చేస్తున్నా.

– గట్ల సంతోష్‌కుమార్, ఫొటోగ్రాఫర్, పాడేరు

అపోహలు వద్దు



రక్తదానంపై ప్రజలు ఎలాంటి అపోహలు వద్దు. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. దాత నుంచి 400 మిల్లీలీటర్ల రక్తం కన్నా తక్కువే సేకరిస్తాం. ఈ ప్రక్రియ తరువాత కొన్ని గంటలు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల పురుషులు, మహిళలు రక్తదానం చేయవచ్చు.రక్తదానానికి 12 గంటల ముందు ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి.

– రూప, వైద్యాధికారి, రెడ్ క్రాస్ సొసైటీ, పాడేరు

46,741 మందికి క్షయ నివారణ టీకాలు

- 3,72,124 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు
- 1139 మందికి వ్యాధి నిర్ధారణ
- వెయ్యికి పైగా మలేరియా కేసులు నమోదు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొయ్యూరు: జిల్లాలో ఇప్పటి వరకు 46,741 మందికి క్షయ నివారణకు సంబంధించిన బీసీజీ టీకాలు వేశామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జమాల్ బాషా తెలిపారు. గురువారం రాత్రి ఆయన రాజేంద్రపాలెం పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. మందుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 78 మంది హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేశామన్నారు. మరి కొందరిని చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సికిల్ సెల్ ఎనీమియాకు సంబంధించి 3,72,124 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. దీనిలో 1,139 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని చెప్పారు. 12,161 మందికి పాక్షికంగా ఉందన్నారు. వారికి మరోసారి పరీక్షలు నిర్వహించి నిర్ధారిస్తామని తెలిపారు. ఎపిడమిక్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. అరకు, అనంతగిరి ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వెయ్యి మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమ తెరలను వినియోగించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

న్యూస్‌రీల్

విధులకు డుమ్మా కొడితే చర్యలు

- గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

కొయ్యూరు: విధులకు డుమ్మా కొట్టే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరచిన నాడే ఉపాధ్యాయులు విధిగా విధులకు హాజరు కావాలని ఆయన సూచించారు. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించిన పాఠశాలల్లో సీఆర్‌టీలు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. సీఆర్‌టీల్లో అర్హత గల వారికి రెగ్యులర్ అయిందన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చేరే విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశాలు ఇచ్చామని డీడీ పేర్కొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం

- ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



గంగవరంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టామని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంఆర్సీ వద్ద వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను ఆయన అందజేశారు. వీటిని సకాలంలో విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆయన ఆదేశించారు. ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు, సీఆర్పీలు శివ, ప్రసాద్, భాస్కర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మానవత్వం



అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: జి.మాడుగుల రోడ్డులోని వడ్డెపల్లి జంక్షన్ వద్ద బైక్ ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి సకాలంలో అంబులెన్స్‌ను సమకూర్చి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం ఉదయం ఆయన జి.మాడుగుల పర్యటనకు బయలుదేరారు. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే గాయాలతో పడి ఉన్న హుకుంపేట మండలం పెదగరువు గ్రామానికి చెందిన గిరిజన యువతి పరిస్థితి చూసి ఆయన చలించారు. వెంటనే తన కారును ఆపి 108 అంబులెన్స్ ఫోన్ చేసి సకాలంలో రప్పించారు. అంబులెన్స్‌లో యువతిని దగ్గరుండి ఎక్కించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.ఆమెకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని ఆస్పత్రి వైద్యులను ఫోన్లో ఎమ్మెల్యే కోరారు.

కైలాసగిరిపై రామ్‌చరణ్ సందడి



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న నటుడు రామ్‌చరణ్

కొమ్మాది: మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ గురువారం కై లాసగిరి కొండపై సందడి చేశారు. ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గేమ్ ఛేంజర్'సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ కలెక్టర్ పాత్రలో నటిస్తున్నారు. షూటింగ్ నిమిత్తం గురువారం మధ్యాహ్నం విశాఖ వచ్చిన ఆయన.. కై లాసగిరిపై జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం నోవాటెల్‌కు చేరుకున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆర్.కె.బీచ్ వద్ద పలు సన్నివేశాలు చిత్రీకరణ అనంతరం తిరిగి ఆయన హైదరాబాద్‌కు పయనమవుతారు.

- బీచ్‌రోడ్డులోని మంగమారిపేట రామాద్రి బీచ్ వద్ద ఆదివారం నటుడు నాగచైతన్య సందడి చేయనున్నారు. ఆయన నటిస్తున్న ఓ సినిమా కోసం బీచ్ వద్ద సెట్ ఏర్పాటు చేశారు.

దేవీపట్నం ఐకేపీ ఏపీఎం సరెండర్

- ఉత్తర్వులు జారీ చేసిన రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- విధుల నిర్వహణలో నిర్లక్ష్యమే కారణం

రంపచోడవరం: దేవీపట్నం వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఐకేపీ ఏపీఎం సూరమ్మను కాకినాడలోని డీఆర్‌డీఏ కార్యాలయానికి గురువారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సరెండర్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. ఈ శాఖలో నిధులు దుర్వినియోగం, ఉద్యోగులు సస్పెన్షన్లతో ప్రారంభమైన వివాదం కొనసాగుతోంది. దేవీపట్నం వెలుగు(ఐకేపీ)లో పనిచేస్తున్న సీసీలు నిర్మల్ కుమార్, గోపాలకృష్ణ, చిలకమ్మ,హేమలతను సుమారు నెల రోజుల క్రితం రంపచోడవరం వెలుగు ఏపీడీకి ఏపీఎం సూరమ్మ సరెండర్ చేశారు. నిబంధనల ప్రకారం సీసీలను సరెండర్ చేసే అధికారం ఏపీఎంకు లేదు. తరువాత నెలకొన్న పరిణామాలతో దేవీపట్నం మండల సమాఖ్య కమిటీ నలుగురు సీసీలను జిల్లా మహిళ సమాఖ్య (కాకినాడ)కు సరెండర్ చేస్తున్నట్లు తీర్మానం చేసి పంపించారు. దీంతో నలుగురు సీసీలు హైకోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సమయంలోనే సీసీలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవీపట్నం మండల పరిషత్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. ఇద్దరు సీసీలు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు తేలిందని దేవీపట్నం మండల మహిళ సమాఖ్య తెలిపింది. నిబంధనలప్రకారం వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు వ్యవహరించకుండా నిధుల దుర్వినియోగాన్ని పక్కన పెట్టి అవినీతికి పాల్పడిన సిబ్బందికి సహకరిస్తూ ఐటీడీఏ పీవోను కూడా తప్పుదారి పట్టించినట్టు మహిళ సమాఖ్య ఒక ప్రకటనలో ఆరోపించింది. మారేడుమిల్లి, రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో కొండచీపుర్లు, పసుపు కొనుగోళ్ల జరిగిన నిధుల దుర్వినియోగంలో ఏపీడీ ప్రమేయం ఉందని మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి కె. పోశమ్మ, కె.రత్నం ఆరోపించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఏపీఎం సూరమ్మను ఐటీడీఏ పీవో సరెండర్ చేశారని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో పొడవైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చురుగ్గా జరుగుతున్న పనులు

ఎటపాక: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో పొడవైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గోదావరి వరదల సమయంలో భద్రాచలం వద్ద 53 అడుగులకు వరద చేరిన సమయంలో ఎటపాక మండలంలోని చోడవరం, వీరాయిగూడెం గ్రామాల మధ్య వాగు పరివాహక ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు నీటమునుగుతున్నాయి. ఈ సమయంలో ఎటపాక నుంచి బుట్టాయిగూడెం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ విద్యుత్ లైన్ నీట మునగడంతో సరఫరా నిలిపి వేస్తుంటారు. దీనివల్ల బుట్టాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని సుమారు 60 గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఎత్తయిన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వరదల సమయం సమీపిస్తుండటంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేఈ రాజ్‌కపూర్ ఆధ్వర్యంలో స్తంభాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గోదావరి వరద 63 అడుగులు వచ్చినప్పటికీ ఎటపాక నుంచి బుట్టాయిగూడెం సబ్‌స్టేషన్‌కు 33 కేవీ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగిస్తారు. ఈ పనులు పూర్తయితే నెల్లిపాక నుంచి లక్ష్మీపురం, బండిరేవు, బుట్టాయిగూడెం నుంచి మురుమూరు వరకు ఉన్న గ్రామాలకు 11కేవీ ద్వారా విద్యుత్ సరఫరా చేయవచ్చని జేఈ వెల్లడించారు.



ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

కేజీహెచ్‌కు లారీ ప్రమాద బాధితుల తరలింపు



క్షతగాత్రుల బంధువులతో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

సాక్షి,పాడేరు: ఘాట్‌లో లారీ బోల్తా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో రాజు, గణేష్, పవన్‌ను బుధవారం రాత్రి తరలించగా మిగిలిన తొమ్మిది మందికి ఇక్కడే వైద్యసేవలు అందించారు. గురువారం ఉదయం వీరందరికీ స్కానింగ్, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిని కూడా కేజీహెచ్‌కు తరలించాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. ఈ మేరకు లంక శ్రీను (యలమంచలి), వి.మోహన్ (ధర్మవరం), లంక దీక్షిత (యలమంచిలి), బి.రవి(షేకిళ్లపాలెం), గొర్లె రోహిత్‌కుమార్ (షేకిళ్లపాలెం), పి.భారతి (కొత్తపాలెం),లంక సునీత(యలమంచిలి)తో పాటు మరో ఇద్దరిని ప్రత్యేక అంబులెన్సుల్లో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు

మృతదేహాలకు పోస్టుమార్టం

లారీ బోల్తా ఘటనలో హరీష్, లక్ష్మణ్, అశోక్ మృతి చెందారు. వీరి మృతదేహాలకు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులు, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురికి వైద్య సేవలు

మహారాణిపేట (విశాఖ) : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరిలో నలుగురికి ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆడారి నితిన్‌కుమార్ (20), కె.పవన్ (19), ఎస్.గణేష్ (30), ఈఎస్‌వీ రాజు (20)కు అందిస్తున్న వైద్య సేవలను గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పర్యవేక్షించారు. క్షతగాత్రుల్లో రాజు ప్రాథమిక వైద్యం అనంతరం కేజీహెచ్ నుంచి పరారైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ముగ్గురికి వైద్య సేవలందిస్తున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. బాధితులకు ఆర్థోపెడిక్, ఇతర జనరల్ వైద్యులు సేవలందిస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించండి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే
- అధికారులతో వీడియో కాన్ఫరెన్సు



గిరిజన సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొత్త విద్యార్థులను చేర్పించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అధికారులను ఆదేశించారు. పీవో తన చాంబర్ నుంచి గురువారం గిరిజన సంక్షేమ శాఖ అధికారులో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఏటీడబ్ల్యూవోలు ప్రతీ రోజు 15 పాఠశాలలను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా మందు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలని సూచించారు. అలాగే వాటర్ ట్యాంక్‌లు క్లీనింగ్ చేయించాలని ఆదేశించారు.ఈ నెలాఖరు వరకు ఆశ్రమ పాఠశాలలకు సరుకులు, కూరగాయలు, చికెన్‌ను పాత టెండర్ దారుల నుంచి పొందాలని సూచించారు. పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఐటీడీఏ నుంచి ఒక సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. శనివారం నాటికి కొత్త అడ్మిషన్లు పూర్తి స్థాయిలో జరగాలన్నారు. డీడీ ఇంచార్జ్ తేజశ్విని, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, సుజాత, ప్రసాద్ పాల్గొన్నారు.

జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్‌లు

విశాఖ లీగల్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిజికల్/వర్చువల్ విధానంలో ముందస్తుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ప్రీ లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు వీలు కల్పిస్తున్నట్లు వివరించారు. నోటీసులు అందుకున్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ఫిజికల్ లేదా వర్చువల్ విధానంలో పరిష్కరించుకోవాలని పర్మినెంట్ లోక్ అదాలత్ అధ్యక్షుడు జి.వల్లభనాయుడు, విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ కక్షిదారులకు హితవు పలికారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించవచ్చని సూచించారు.

క్యాన్సర్‌కు మెరుగైన వైద్య సేవలు



సమీక్షకు హాజరైన వైద్యాధికారులు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషా



రాజవొమ్మంగిలో 104, 108 రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషా

- రోగులను గుర్తించేందుకు అవగాహన, శిక్షణ కార్యకమ్రాలు
- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

రంపచోడవరం: ఏజెన్సీలో క్యాన్సర్ రోగులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏజెన్సీలోని 18 పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌సీల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించేందుక వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలను మూడు బ్యాచ్‌లుగా విభజించి తొమ్మిది రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందన్నారు. రెండో బ్యాచ్‌కు 18 నుంచి 20 వరకు, మూడో బ్యాచ్‌కు 24 నుంచి 26 వరకు ఈ కార్యక్రమం జరగుతుందన్నారు. మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి రోగులకు గుర్తించిన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీషా, రత్నప్రసాద్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీని డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషా గురువారం సాయంకాలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ మెషీన్ సేవలపై ఆరా తీశారు. 104, 108 వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. బర్త్ వెయిటింగ్ గదులను పరిశీలించారు. అదే సమయంలో వైద్యాధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. సీహెచ్‌వో పద్మావతి, హెచ్‌ఎస్. సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, పైలెట్ కనకరాజు ఆయన వెంట ఉన్నారు.

టీడీపీ దాడులకు భయపడొద్దు


కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

- కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా నిలుస్తుంది
- కార్పొరేషన్, స్థానిక సంస్థల్లో ప్రలోభాలకు గురిచేసే అవకాశం
- కేంద్రంలో ఎన్డీయేకు పూర్తి స్థాయి మెజారిటీ లేదు
- పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు కీలకం
- కార్పొరేటర్లతో వైవీ సుబ్బారెడ్డి సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకల దాడులకు ఎవరూ భయపడవద్దని, పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. ఎండాడ లా కాలేజీ సమీపంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆక్షేపించారు. అంతేకాకుండా కార్పొరేషన్, స్థానిక సంస్థల్లో ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని, వారి ప్రలోభాలను తిప్పికొట్టాలని అప్రమత్తం చేశారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లేని పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ బలమైన నలుగురు లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు కీలకం కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా పార్టీ అధినేత నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

- ఇంటిలో సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- పీఎం సూర్యఘర్‌కు విశాఖ సర్కిల్ పరిధిలో 452 దరఖాస్తులు
- నెట్ మీటర్‌తో విద్యుదుత్పత్తి, వినియోగం తెలుసుకునే అవకాశం
- కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌తో నెలకు 125 యూనిట్ల వరకూ విద్యుదుత్పత్తి

పైకప్పుపై 'పవర్'!

ఏ ఇంటికైనా నెల వచ్చిందంటే భయపెట్టేది కరెంటు బిల్లే. గృహ విద్యుత్తు దాదాపుగా ప్రతి రాష్ట్రంలోనూ వినియోగదారులకు భారంగానే మారుతోంది. ఈ నేపథ్యంలో గృహ వినియోగదారులు స్వయంగా విద్యుత్‌ని ఉత్పత్తి చేసుకుంటే కరెంటు బిల్లు బెడద లేకుండా హాయిగా ఉండొచ్చు. కేవలం విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవడమే కాదు.. మనం వాడుకోగా మిగిలిన కరెంటును ఎంచక్కా డిస్కంలకు అమ్మి సొమ్ము చేసుకునే ప్రయోజనం కూడా ఉంటుంది. భవిష్యత్ విద్యుత్ అవసరాల దృష్ట్యా కేంద్రం సరికొత్త విధానాలను అమల్లోకి తెచ్చింది. అందులో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తోంది. సోలార్ విద్యుత్ తయారీకి సబ్సిడీ, రుణ సదుపాయం కల్పించింది. ఆసక్తిదారులు 'పీఎం సూర్యఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునే సౌకర్యం కల్పించింది.

సాక్షి, విశాఖపట్నం : మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ని మొబైల్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలోవాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం రాయితీని అందిస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో 'నెట్ మీటర్' ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ని గణిస్తారు. ఈపీడీసీఎల్‌లోని విశాఖపట్నం సర్కిల్‌లో ఇప్పటి వరకు 452 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రూ.78 వేల వరకు సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వ ప్రకటన ప్రకారం, ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్ సిస్టమ్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. 2 కిలోవాట్ల ప్యానల్‌కు రూ.60 వేలు సబ్సిడీ, 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సిస్టమ్‌కు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుంది. సబ్సిడీ పోను, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెచ్చించే అదనపు ఖర్చును బ్యాంక్‌లోన్ రూపంలో పొందొచ్చు. దీనిపై తక్కువ వడ్డీ తీసుకుంటారు. ఈ లోన్ కోసం బ్యాంక్‌లకు ప్రజలు ఎలాంటి పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రకటన ప్రకారం ఇంటి పైకప్పుపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాలు బిగించుకోవడానికి 7% వడ్డీ రేటుతో కొలేటరల్ ఫ్రీ లోన్ (తాకట్టు లేని రుణం) అందుబాటులో ఉంటుంది.

30 రోజుల్లో రాయితీ

నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారులు 'పోర్టల్'లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చెయ్యాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లోనే వినియోగదారుడికి చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3-4 ప్యానల్స్ (1 మీటరు వెడల్పు - 1.6 మీటర్ల ఎత్తు)ని అమర్చనున్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ సూర్యరశ్మిని నిలిపేసుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారుడు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

- ఆధార్ కార్డు
- నివాస ధృవీకరణ పత్రం
- విద్యుత్ బిల్లు
- బ్యాంకు పాస్ బుక్
- పాస్‌పోర్ట్ సైజు ఫొటో
- రేషన్ కార్డు
- మొబైల్ నంబర్
- అఫిడవిట్
- ఆదాయ ధృవీకరణ పత్రం


ఇంటిపై సోలార్ ప్యానెల్స్

సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అర్హతలు

- దరఖాస్తుదారుడు భారతీయ పౌరుడై ఉండాలి.
- వయస్సు 21 సంవత్సరాలు దాటి ఉండాలి.
- సోలార్ ప్యానెళ్ల వ్యవస్థ ఏర్పాటు చేయడానికి స్థలం ఉండాలి.
- దరఖాస్తుదారు వార్షిక వేతనం రూ. 1.5 లక్షల కంటే ఎక్కువ ఉండకూడదు.
- పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రాధాన్యత ఉంటుంది.
- దరఖాస్తుదారు గానీ, అతని కుటుంబంలో గానీ ప్రభుత్వ ఉద్యోగి/ఉద్యోగులు ఉంటే అనర్హులు.
- దరఖాస్తుదారు దగ్గర అవసరమైన సరైన పత్రాలు ఉండాలి.
- దరఖాస్తుదారు బ్యాంక్ ఖాతా ఆధార్ కార్డ్ లింక్ అయి ఉండాలి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా చూసే 'సూర్యఘర్' అద్భుతమైన పథకం. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం కల్పిస్తోంది. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా ఎంత విద్యుత్ ఉత్పత్తి అయ్యింది.. అందులో ఎంత మేర వినియోగిస్తున్నాం అనే వివరాలు కూడా సులువుగా తెలుసుకోవచ్చు. సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులతో నివృత్తి చేసుకునే అవకాశం ఉంది.

–ఎల్.మహేంద్రనాథ్, ఈపీడీసీఎల్ ఎస్‌ఈ

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం (విశాఖ) : పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- గురువారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు– హతియా (12836) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా ఉదయం 10.30 గంటలకు బయల్దేరింది.
- గురువారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరింది.

పాము కాటుకు విద్యార్థి మృతి


మృతి చెందిన లక్ష్మి

పద్మనాభం: బాందేవపురానికి చెందిన విద్యార్థిని పాము కాటుకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ జె.సురేష్ తెలిపిన వివరాలివీ.. బోనెల సింహాద్రి, భార్య, కుమార్తె లక్ష్మి(14)తో అదే గ్రామంలో నివసిస్తున్నారు. ఉక్కపోతతో బుధవారం రాత్రి ఇంటి ఆరు బయట నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో చినుకులు పడడంతో ఇంటి లోపలికి వెళ్లి గచ్చుపై నిద్రించారు. రాత్రి 1.30 గంటల సమయంలో లక్ష్మి కుడి కాలుపై పాము కాటేసింది. దీంతో ఆమెను విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో మృతి చెందింది. ఆమె 9వ తరగతి చదువుతోంది. లక్ష్మి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 9.5 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రైల్వేస్టేషన్‌లో గురువారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన జులు రెహమాన్, రాజన్ థండర్ బ్యాగుల్లో సుమారు రూ.47,500 విలువైన 9.5 కిలోల గంజాయిని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా.. విశాఖ మీదుగా పశ్చిమ బెంగాల్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎల్.కీర్తిరెడ్డి తెలిపారు.

ఇంట్లో చోరీ..బంగారం అపహరణ


తెరిచి ఉన్న బీరువా తలుపులు, చిందరవందరగా దుస్తులు

కోటవురట్ల : అన్నవరం గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి వస్తువులను దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన మంగ ఈ నెల 8వ తేదీన కొడవటిపూడిలోని తన పుట్టింటికి వెళ్లి, తిరిగి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇనుప బీరువా తెరిచి చెల్లాచెదురుగా దుస్తులు పడి ఉన్నాయి. ఇంటి వెనక తలుపులు తొలగించి ఉన్నాయి. దీంతో ఆందోళనతో బీరువాను వెతకగా అందులో దాచిన 3 తులాల బంగారు వస్తువులు, 12 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు తెలుసుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్నెట్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.4.50 లక్షలు నష్టం

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై స్టేట్‌బ్యాంకు పక్కనున్న ఎస్‌వీఎస్ ఇంటర్నెట్ షాపులో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు దుకాణమంతా వ్యాప్తి చెందాయి. ఈ ప్రమాదంలో జెరాక్స్, లామినేషన్ మిషన్లు, ఫర్నిచర్, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే యలమంచిలి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్నిమాపక శకటంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. మొత్తం రూ.4.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు స్థానిక అగ్నిమాపక అధికారి రాంబాబు మీడియాకు తెలిపారు.

ఘనంగా పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవలో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో ఎల్ఎల్‌బీ కోర్సు ప్రారంభం

సబ్బవరం: ఈ విద్యా సంవత్సరం నుంచి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా మూడేళ్ల ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 12వ తేదీ వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం www.dsnlu.ac in ను సందర్శించవచ్చు.

విశేషంగా నిత్య కల్యాణం


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేంపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

వుషు పోటీల్లో అరుణకు గోల్డ్ మెడల్


ప్రథమ స్థానంలో నిలిచిన కోరుకొండ అరుణ

అనకాపల్లి: సౌత్‌జోన్ ఖేలో ఇండియా వుషు 2024–25 పోటీల్లో అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీకి చెందిన కోరుకొండ అరుణ 65 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కోచ్ దువ్వాడ హరీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 13 వరకూ కర్ణాటకలోని భగల్‌కాట్‌లో సౌత్ జోన్ ఖేలో ఇండియా వుషు పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణా, ఒడిశా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వుషు పోటీల్లో అరుణ ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

90 రోజుల ప్రణాళిక అమలు తప్పనిసరి

పాడేరు సర్వశిక్ష అభియాన్ ఏఎంవో భాస్కరరావు


అనంతగిరి బాలికల-1 పాఠశాలలోని మొక్కలను నాటుతున్న ఏఎంవో కె.భాస్కరరావు, ఏఎస్‌వో సింహాచలం తదితరులు

అనంతగిరి: ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిల చేరిన విద్యార్థులకు సామర్థ్యం పెంచేలా 90 రోజుల ప్రణాళికను అమలు చేయాలని పాడేరు సర్వశిక్ష అభియాన్ ఏఎంవో కె.భాస్కరరావు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీపీ, బాలికల-1, భీసుపురం, ఎగువశోభ జీపీఎస్‌టీడబ్ల్యూ, ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో క్లబ్ పేరిట గురువారం నుంచి ఈనెల 28 వరకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దీంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలను ప్రతీ పాఠశాలలో అమలుచేయాలన్నారు. ఒకటో తరగతిలో చేరిన ప్రతీ విద్యార్థికి సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా 90 రోజుల ప్రణాళికలతో వారి అభ్యసన సామర్థ్యం పెంచేందుకు కృషి చేయాలన్నారు. మూడు నెలల తరువాత విద్యార్థుల సామర్థ్యాలపై కేంద్ర బృందాలు తనిఖీ చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో సింహాచలం, ఎంఈవో కిల్లో బాలాజీ, సీఆర్పీలు రామకృష్ణ, సునీత, ఆంజనేయులు, గణేష్‌బాబు, రవి కుమార్ పాల్గొన్నారు.

నా అన్నవారు ఎవరూ లేరని..

బొడ్డుమామిడి లంకలో యువతి బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న రాధమ్మ

కొయ్యూరు: నా అన్నవారు ఎవరూ లేరని జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని ఎం. భీమవరం పంచాయతీ బొడ్డుమామిడిలంకలో గురువారం చోటు చేసుకుంది. మంప ఎస్సై లోకేష్ కుమార్ వివరాల ప్రకారం... బొడ్డుమామిడిలంకకు చెందిన కోండ్ల రాధమ్మ(19) ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఆమె చిన్నతనంలో తల్లి చనిపోయింది. కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ తమ్ముడు చనిపోయాడు. నాటి నుంచి తండ్రి మరో వివాహం చేసుకుని వేరే చోట ఉండడంతో రాధమ్మ నాన్నమ్మ వద్ద ఉండేది. గత నెలలో నాన్నమ్మ మరణించడంతో తనను చూసే వారు ఎవరూ లేరని తీవ్ర మదన పడేది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను బతికించేందుకు స్థానికులు ప్రయత్నించి రంపచోడవరం నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నర్సింహులు

చింతపల్లిరూరల్: కాలనుగుణంగా వచ్చే వ్యాధులు పశువులకు సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నర్సింహులు అన్నారు.స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశువులకు వచ్చే జబ్బవాపు, గొంతువాపు వంటి వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు మండలాలకు సంబంధించి జబ్బవాపు వ్యాధికి సంబంధించి 26,856, గొంతువాపునకు సంబంధించి 6,400 పశువులకు వ్యాక్సినేషన్ వేశామన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లో పశువులకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై ప్రచారం చేసి పాడిరైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి ఏడీ డాక్టర్ చంద్రశేఖర్, పశువైద్యాధికారులు దమయంతి, షాలిని, దుర్గాప్రసాద్, ప్రసన్నస్వామి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్‌లాక్‌లు


రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాక్‌లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అల్లిపురం: నో పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేయొద్దని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి అన్నారు. గురువారం ఆమె తన సిబ్బందితో కలిసి బౌడరా రోడ్డు, అచ్చియ్యమ్మపేట జంక్షన్, కొబ్బరితోట కూడలి ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించిన వాహనాలకు, నో పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన వాహనాలకు వీల్‌లాక్ లు వేశారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే వీల్‌లాక్‌లు వేస్తామని, రూ.1035 ఫైన్ వేస్తామని హెచ్చరించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తప్పవన్నారు. పోలీసులు సూచించిన చోట మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.